‘వేదిక’ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

అడవికి ముప్పు

వికారాబాద్ అడవుల్లో ఐదు దాకా నదులు ఊపిరిపోసుకుంటాయి. ఇక్కడి గాలి విశిష్టమైంది. ఆరోగ్యదాయకమైంది. అందుకే అనంతగిరిలో టీబీ శానిటోరియం నెలకొన్నది. విశిష్టమైన జీవవైవిధ్యం ఈ అడవుల చల్లని నీడలో వర్ధిల్లుతున్నది. అనంతగిరి కొండలకు అటూ ఇటూ అడవులు పరుచుకొని ఉన్నాయి. ఒకవైపు ఉన్న అడవిని దామగుండం అని, మరో వైపు ఉన్న అడవి అనంతగిరి అడవి అని పిలుస్తారు. ‘అనంతగిరికా హవా లాఖో బీమారియోంకా దవా’ అనే నానుడి అక్కడి స్వచ్ఛమైన గాలి విశిష్టతను తెలియజేస్తున్నది. మూసీ మూలాధారమైన నీటి ఊటల్లో కొన్ని దామగుండం వైపు ఉన్నాయి.

అయితే ఇప్పుడీ పర్యావరణానికి నౌకాదళ కమ్యూనికేషన్ కేంద్రం రూపంలో ముప్పు ఏర్పడుతున్నది. వికారాబాద్ అడవిని ఆనుకొని ఉన్న దామగుండం అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న వెరీ లో ఫ్రీక్వెన్సీ (వీఎల్ఎఫ్) రాడార్ కోసం భారీగా అడవులను నరికేయబోతుండటమే అందుకు కారణం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత జనవరి 24న భూమి బదిలీకి సంబంధించిన ఒప్పందం కుదిరింది. రాష్ట్ర ప్రభుత్వం రాడార్ కోసం అప్పగించిన 2,900 ఎకరాల భూమిని నేవీ తన ఆధీనంలోకి తీసుకొని సరిహద్దులు గీసే పనికి శ్రీకారం చుట్టింది. రాడార్ కేంద్రం కోసం పెద్ద ఎత్తున చెట్లను కొట్టివేయాల్సి ఉంటుంది. రోడ్ల నిర్మాణం కూడా జరుగుతుంది. రాడార్ చుట్టూరా ఓ చిన్నసైజ్ పట్టణమే వెలుస్తుందంటున్నారు. ఈ నేపథ్యంలో దామగుండం అటవీ భూముల పరిరక్షణ అంశం మరోసారి చర్చలోకి వచ్చింది.

దేశ రక్షణ కోసం కమ్యూనికేషన్స్ వ్యవస్థ లాంటివి నిర్మించడం ముఖ్యమే. కానీ సదరు నిర్మాణాలు పర్యావరణానికి ముప్పు తెచ్చిపెట్టేవిగా ఉండకూడదన్నదీ అంతే ముఖ్యం. దామగుండం ప్రతిపాదన వచ్చినప్పటి నుంచీ స్థానికులు, పర్యావరణ ఉద్యమకారులు నిరసనలు తెలుపుతున్నారు. న్యాయస్థానాల్లో పలు ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు దాఖలయ్యాయి. నేవీ రాడార్‌తో సుమారు 40-50 కిలోమీటర్ల పరిధిలో రేడియేషన్ ప్రభావం ఉంటుందని అంటున్నారు. రాడార్ వ్యవహారంపై రాజకీయాలూ చోటుచేసుకున్నాయి. కేంద్రంలో కాంగ్రెస్ హయాంలో రాడార్ కేంద్రంపై నిర్ణయం జరిగింది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఫైలు బయటకు తీసి హడావుడిగా స్థల కేటాయింపు జరిపింది. తీరా స్థానికుల నుంచి తీవ్ర నిరసన ఎదురైనప్పుడు బీఆర్ఎస్ ప్రభుత్వంపైకి నెపం నెట్టివేసేందుకు కాంగ్రెస్ సర్కారు విఫలయత్నం జరిపింది. ఆ సంగతి అలా ఉంచితే మూసీ నది సుందరీకరణ పేరిట భారీ ప్రణాళికలు వేస్తున్న ప్రభుత్వం ఆ మూసీ జన్మస్థలమైన అడవుల విధ్వంసానికి ఎలా సిద్ధమవుతున్నదనేది ప్రశ్న.

2027లో నిర్మాణం పూర్తిచేసుకుంటుందని భావిస్తున్న దామగుండం రాడార్ కేంద్రం కోసం ఒక అంచనా ప్రకారం సుమారు 12 లక్షల చెట్లను నరికివేయాల్సి ఉంటుంది. దీనివల్ల అంతకు ఎన్నోరెట్లు పక్షులు ఆవాసం కోల్పోతాయి. నదీ మూలాల వద్ద చెట్ల నరికివేత వల్ల వరద సమస్య పెచ్చరిల్లిపోయి, జనావాసాలూ సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఇలా పలురకాల గొలుసుకట్టు చర్యకు ఈ విధ్వంసం కారణమవుతుంది. ఈ నేపథ్యంలో రాడార్ కేంద్రం వేరే చోటుకి తరలించాలనే సూచనలు వినవస్తున్నాయి. పైగా ఇక్కడ ఉపయోగించాలనుకుంటున్న సాంకేతికతకు కాలం చెల్లిందని, చాలా దేశాల్లో దీనిని పక్కన పెడుతున్నారనే వాదనలూ వినిపిస్తున్నాయి. చెట్ల నరికివేత ప్రారంభం కాకముందే ప్రకృతి, ప్రజా సంక్షేమం దృష్ట్యా రాష్ట్ర ప్రభు త్వం ఈ సమస్యపై దృష్టిపెడితే బాగుంటుంది.

ఇప్పటికీ మారని మోదీ

టంకశాల అశోక్

లోక్‌సభ ఎన్నికలలో సాంకేతికంగా గెలిచినప్పటికీ రాజకీయంగా, నైతికంగా, వ్యక్తిగతంగా కూడా తిరస్కరణకు గురైన ప్రధానమంత్రి నరేంద్ర మోదీలో కనీసం ఇప్పటికైనా కొంత మార్పు రావచ్చునని ఆశించినవారికి అటువంటి సూచనలేమీ కన్పించటం లేదు. జూన్ 4న ఫలితాలు వెలువడిన తర్వాత ఆయన అదే రాత్రి ఢిల్లీలోని బీజేపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. తర్వాత రోజులలో పార్టీ ఎంపీలను, ఎన్డీయే ఎంపీలను కలిపి సంబోధించి మాట్లాడారు. ఎక్స్ వేదికగా ఒక ప్రకటన కూడా చేశారు. ఆ వివరాలన్నింటిని గమనించినప్పుడు ఆశాభావాలేమీ కలగటం లేదు. ఎందుకంటే, ఆ ప్రకటనలు, ప్రతిజ్ఞలు ఆయన 2014, 2019లలోనూ చేసి అందుకు భిన్నంగా వ్యవహరించారు. పరిస్థితి ఈసారి మరోవిధంగా ఉండగలదా? కనీసం ఆయన మాటల తీరులో మాత్రం అటువంటి సూచనలు లేవు. మునుముందు ఏమైనా మార్పు ఉంటే సంతోషించవచ్చు.

మోదీ ప్రసంగ వివరాలలోకి వెళ్లే ముందుగా మొట్టమొదట చెప్పుకోవలసింది, ఆయన బీజేపీ, ఎన్డీయేల బలం తగ్గుదల గురించి రెండు సమావేశాలలోనూ ఎటువంటి ప్రస్తావన చేయలేదు. ఆత్మ పరిశీలన తను చేసుకోలేదు సరికదా, అటువంటి శోధన అవసరమని పార్టీ నాయకులకు గాని, ఎన్డీయే ఎంపీలకు గాని హితవు చెప్పలేదు. బీజేపీ ఎన్డీయేలు మూడవసారి అధికారానికి రావటం గురించి ఘనంగా పదే పదే చాటుకోవటం, ప్రతిపక్షాలను హేళన చేయటమైతే బాగానే చేశారు. కానీ విజ్ఞత, పరిణతి గల నాయకుడి దృష్టి ఏ విధంగా ఉండాలి? ఆత్మస్తుతి, పరనిందకు పరిమితం కాకూడదు. తన పార్టీలో ఆత్మవిశ్వాసం కల్పించేందుకు పరనింద చేయటంతో పాటు, లోపాలు సరిదిద్దుకునే విధంగా తన పార్టీకి మార్గదర్శనం చేయాలి. ఎన్నికల సమయంలో మోదీ హోరెత్తించినట్లు బీజేపీకి గత పర్యాయపు 303కు మించి 370 మాట అట్లుంచి, కనీస మెజారిటీ అయిన 272 కూడా రాక 240 దగ్గర ఆగింది. ఎన్డీయే బలం 352 నుంచి 400 దాటడం గాక 294కు పరిమితమైంది. వారణాసిలో మోదీ సొంత మెజారిటీ సగానికి పడిపోయింది. దేశమంతా చర్చిస్తున్నది ఈ విషయాల గురించే. సరైన నాయకుడైతే విజయానికి ఆనందాన్ని ప్రకటిస్తూనే, ఫలితాలు ఆశించిన విధంగా రాకపోవటాన్ని సభ్యుల ముందు ధైర్యంగా నిజాయితీగా ప్రస్తావించాలి. అందుకు మనమందరం కారణాలను శోధించి దిద్దుబాట్లు చేసుకోవాలని, చేసుకుందామని, 2029 నాటికి తిరిగి పుంజుకుందామని అనాలి. కానీ మోదీ ఇటువంటి లక్షణాలు ప్రదర్శించలేదు. ఆయనకు గుజరాత్ రోజుల నుంచి కూడా నిగూఢమైన, ఒంటరి పోకడలు పోయే మనిషన్న పేరు ఉన్నది. అదే ఇప్పుడు సైతం కన్పించింది.

ప్రసంగ వివరాలలోకి వెళితే, 4వ తేదీ సాయంత్రం పార్టీ నాయకుల సమావేశంలో మోదీ ప్రసంగం మొదలైంది ‘జై జగన్నాథ్’ అనే మత పరమైన నినాదంతో. తాము ఒడిషాలో మొదటిసారి గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయనుండటాన్ని గుర్తుచేస్తూ ఆయన ఆ నినాదం ఇచ్చారు. గెలవటం వరకు అభినందించదగ్గదే. కానీ, ఎన్నికల ప్రచారాన్నంతా మతమయం చేసి, హిందీ రాష్ట్రాలలోనూ ప్రజలను విసుగెత్తించి ఎదురుదెబ్బలు తిన్న తర్వాత, ఇప్పటికీ ఆ ధోరణిని మానుకోకపోవటాన్ని ఏమనాలి? మునుముందు సైతం తను ఇంతేనని దేశ ప్రజలు భావించాలా? అదేగాని ఆయన ఉద్దేశమైతే ప్రజలు తమ నిర్ణయాలు తాము తీసుకోవటం సహజమవుతుంది. మోదీ 2001-14 మధ్య గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉండినప్పుడు సమాజంలో, రాజకీయాలలో మతతత్వాన్ని చాలా బలంగా వ్యాపింపజేయగలిగారు. ఆ స్థితి తను అక్కడినుంచి బయటకు వచ్చిన పదేండ్లుగా కూడా అంతే బలంగా కొనసాగుతున్నది. కానీ, గుజరాత్ పరిస్థితి ఆ విధంగా పరిణమించటానికి గల కారణాలు మోదీ కన్న చాలాకాలం ముందు నుంచి ఉన్నాయి. ఆ పునాదులపై ఆధారపడి ఆయన ఆ పని చేయగలిగారు.

అదే మతతత్త్వ ప్రాజెక్టును దేశవ్యాప్తం చేసేందుకు తను గత పదేండ్లుగా ప్రయత్నిస్తున్నారు. అది కొంతకాలం ముఖ్యంగా హిందీ రాష్ట్రాలలో బాగానే ముందుకుసాగినా, అందుకు గల పరిమితులేమిటో ఈ ఎన్నికలలో ప్రజలు రుజువు చేశారు. దాన్ని బట్టి ఆయన తన ప్రాజెక్టును, ధోరణిని సవరించుకోవటం అవసరం. అటువంటి గుర్తింపు బీజేపీలో, సంఘ్ పరివార్‌లో కలుగుతున్నట్టు వింటున్నాము. దేశంలో హిందూ రాష్ట్రం ఏర్పడాలనే ఆశయం బీజేపీ, సంఘ్‌పరివార్‌లకు ఎప్పటినుంచో ఉన్నదే. అయితే అందుకోసం మోదీ తరహా తీవ్రవాద ధోరణిని వారు ఇంతకు ముందు చూపలేదు. దీనంతటి మధ్య మరొక అభిప్రాయం కూడా వినవస్తున్నది.

హిందుత్వం పేరిట మోదీ చేస్తున్నది వాస్తవంలో స్వీయాధికార సాధన కోసమేనని, అందుకే లోగడ గుజరాత్‌లో, ఇప్పుడు జాతీయస్థాయిలో సంఘ్ పరివార్‌ను, బీజేపీ సీనియర్లను సైతం ధిక్కరించటం కనిపిస్తున్నదని. ఈ స్థితిలో, ఈ విధమైన ఎన్నికల ఫలితాల మధ్య కూడా ఆయన తన తీవ్ర మత తత్త్వ ప్రాజెక్టును వదులుకోని పక్షంలో, మునుముందు ప్రజల వైపు నుంచి గాని, పరివార్ నుంచి గాని ఎటువంటి పరిస్థితులు ఎదురుకావచ్చునో చూడవలసి ఉంటుంది.

తక్కిన ప్రసంగ విషయాలకు వస్తే గుర్తించవలసినవి కొన్నున్నాయి. ఒకటి, ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నప్పటికీ దేశాభివృద్ధి కోసం అందరితో కలిసి పని చేయగలమనటం. రెండు, ఈ విడత పాలనలో భారీ నిర్ణయాలు తీసుకోగలమనటం. మూడు, అవినీతి నిర్మూలనకు తీవ్రమైన చర్యలు ఉండగలవనటం. నాలుగు, రాజ్యాంగమే తనకు దిక్సూచి కాగలదనటం. అయిదు, గ్రీన్ ఎకనామీ, పర్యావరణ పరిరక్షణల ప్రస్తావన. ఆరు, అన్ని నిర్ణయాలు సమిష్టిగా తీసుకోవటం. ఏడు, అన్ని మతాలు సమానమనేది తమ సిద్ధాంతమనటం. స్థూలంగా ఇవీ ఆయన పేర్కొన్న విషయాలు. ఇవి తప్పకుండా ప్రశంసించదగ్గ ఆలోచనలే. సమస్య ఉత్పన్నమయేది ఆచరణలో. వాస్తవానికి తన ప్రకటనలలో కొత్త ఏమీ లేదు. మనం 2014, 2019లలో విన్నవే ఇవి. కాకపోతే, ఈసారి బీజేపీకి సొంత మెజారిటీ లేనందున, బలమైన నాయకత్వం గల ప్రాంతీయ పార్టీలపై ఆధారపడవలసి ఉన్నందున, సమిష్టి నిర్ణయాలు తప్పకపోవచ్చు. లోగడ వాజపేయి నాయకత్వాన ఎన్డీయే కూటమి ప్రభుత్వం 1998-2004 మధ్య ఉండినపుడు పలు అంశాలలో కూటమి భాగస్వాముల అంగీకారంతో తప్ప ముందుకు వెళ్లలేకపోవటం, కొన్ని నిర్ణయాలను వారి వ్యతిరేకత వల్ల ఉపసంహరించుకోవలసి రావటం తెలిసిందే. అయితే, వాజపేయికి, మోదీకి తేడా ఉందని, మోదీ మొండి పట్టుదల మనిషని అంటారు. యథాతథంగా అది నిజమే. కానీ ఇప్పుడున్న పరిస్థితుల మధ్య ఆయన తన పట్టుదలను వదులుకోక తప్పదు. అందువల్ల, కూటమి భాగస్వాములకు అంతగా ఆసక్తి ఉండని విదేశ వ్యవహారాలు, రక్షణరంగం, అంతర్గత భద్రత వంటి రంగాలను మినహాయిస్తే, సాధారణంగా సమిష్టి నిర్ణయాలే జరుగవచ్చు. పోతే, మతం, అల్పసంఖ్యాకవర్గాలకు సంబంధించిన విషయాలలో సున్నితమైన స్థితి ఎదురవుతుంది. ఇందులో ఒకవైపు మోదీ, మరొకవైపు చంద్రబాబు, నితీశ్‌ల మధ్య పూర్తి ఏకాభిప్రాయం గాని లేదా పూర్తి భిన్నత్వం గాని ఉన్నట్టు మనం ఇంతవరకు గమనించినదాన్ని బట్టి తోచదు. అది వారి మధ్య ఒక దోబూచులాట వంటిది. కనుక, ఏమి జరగవచ్చునన్నది క్రమంగా కాని బోధపడదు.

పోతే, ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దేశాభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేయగలమంటున్న మోదీ, 2014లోనూ సహకార ఫెడరలిజం అంటూ మాట్లాడారు గాని, దానిని ఆచరణలో చూపలేదన్నది తెలిసిందే. అందుకు విరుద్ధంగా ఇతర పార్టీ ప్రభుత్వాల పట్ల చాలా వివక్ష చూపారు. తన క్రోనీ క్యాపిటలిజం, క్రోనీ క్యాపిటలిస్టు మిత్రుల ప్రయోజనాల కోసం దేశ సమతులనాభివృద్ధిని, రాష్ట్రాల ప్రయోజనాలను పణంగా పెట్టారు. వీటి ప్రభావంతో అనేక అభివృద్ధి సూచీలలో, ముఖ్యంగా మానవాభివృద్ధి, ఆకలి, ఆరోగ్యం వంటి సూచీలలో దేశ స్థాయి క్రమంగా పడిపోతూ వస్తున్నది. ఇప్పుడాయన దేశాన్ని అయిదు ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చి ప్రపంచంలో మూడవస్థానానికి తీసుకువెళ్లగలమంటున్నారు. అటువంటి స్థానాలు నిజంగా సాధించినా ధనిక-పేద తారతమ్యాలు మరింత పెరగటం మినహా సామాన్యుల నికర జీవితాలు మెరుగుపడబోవన్నది నిపుణుల హెచ్చరిక. ఇటువంటి స్థితిలో, గత అనుభవాల దృష్ట్యా మోదీ ఈ విడత పాలనలో అభివృద్ధి అనే మాటకు అర్థం, ఆచరణ ఏమిటన్నది వేచి చూడవలసిన విషయం. అంతేముఖ్యంగా, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలన్న 2014 నాటి హామీ గాలికిపోగా, జరుగుతున్నదంతా ఉద్యోగ ఉపాధులు లేని ఆర్థికాభివృద్ధి (జాబ్‌లెస్ గ్రోత్) అయినప్పుడు, మోదీ విధానాలు గాని, అధికార కూటమి ఉమ్మడి నిర్ణయాలు గాని గతం కన్న భిన్నంగా ఉండగలవా అన్నది ఒక పెద్ద ప్రశ్న. ఈసారి భారీ నిర్ణయాలు అంటున్న ప్రకటన దేశాన్ని మూడవ ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు క్రోనీ క్యాపిటలిజాన్ని ప్రోత్సహించటం కోసమేనా లేదా ఈ అసమానతలు, నిరుద్యోగం, అభివృద్ధి సూచీల పతనంపై దృష్టి పెట్టేందుకు కూడానా అన్నది మరొక పెద్ద ప్రశ్న.

ఏ రాష్ట్రంలో ఏ పార్టీ అధికారంలో ఉన్నా దేశాభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేయగలమంటున్న మోదీ, 2014లోనూ సహకార ఫెడరలిజం అంటూ మాట్లాడారు గాని, దానిని ఆచరణలో చూపలేదన్నది తెలిసిందే. అందుకు విరుద్ధంగా ఇతర పార్టీ ప్రభుత్వాల పట్ల చాలా వివక్ష చూపారు. తన క్రోనీ క్యాపిటలిజం, క్రోనీ క్యాపిటలిస్టు మిత్రుల ప్రయోజనాల కోసం దేశ సమతులనాభివృద్ధిని, రాష్ట్రాల ప్రయోజనాలను పణంగా పెట్టారు.

విచిత్రమేమంటే, మోదీ అవినీతి నిర్మూలన అంటూ భీషణమైన ప్రతిజ్ఞలు చేసిన ప్రతిసారీ, తీవ్రమైన అవినీతి ఆరోపణలపై తన ప్రభుత్వమే కేసులు పెట్టిన అనేకమంది ప్రముఖులను తమ పార్టీలో చేర్చుకోవటం, కేసులు మూలన వేయటం లేదా రద్దు చేయటం, అగ్రస్థాయి పదవులు కట్టబెట్టడం అనివార్యంగా గుర్తుకువస్తుంది. ఈ వికృత స్థితిని ఎవరెన్నిసార్లు ఎత్తిచూపినా, ప్రధాని మోదీ ఒక్కసారంటే ఒక్కసారైనా అందుకు సాకుల రూపంలోనైనా స్పందించలేదు. మరొకవైపు లొంగిరాని ప్రత్యర్థులపై వివిధ దర్యాప్తు సంస్థలను ప్రయోగిస్తూనే ఉన్నారు.

అటువంటప్పుడు ఇప్పుడు మరొకసారి చేస్తున్న అవినీతి వ్యతిరేక ప్రతిజ్ఞను చూసి నవ్వు వస్తుంది. తను నడుపుతున్న క్రోనీ క్యాపిటలిస్టు వ్యవస్థ, అటువంటి వర్గపు విచ్చలవిడి అవినీతిని పైకి కానరానివిధంగా ప్రోత్సహిస్తూనే ఉంది. రాగల కాలంలో మరొకవిధంగా జరగగలదని గాని, అటువంటి విధానాలను కూటమి భాగస్వాములు వ్యతిరేకించగలరని గాని భావించగలమా? దీనికి సంబంధించే, దేశ వనరులను, పర్యావరణాన్ని ఆయా వర్గాలు తమ వ్యాపార ప్రయోజనాల కోసం ఏ విధంగా కొల్లగొడుతున్నాయో, ధ్వంసం చేస్తున్నాయో నిపుణులు ఎత్తిచూపుతూనే ఉన్నారు. తాజాగా, సున్నితమైన లద్దాఖ్ వంటి సరిహద్దు ప్రాంతంలో గల అరుదైన లోహ నిక్షేపాల కోసం మొదలైన ప్రక్రియను అక్కడి స్థానికులే గాక, స్వయంగా బీజేపీకి చెందిన సుబ్రహ్మణ్యస్వామి వ్యతిరేకిస్తుండటం తెలిసిందే. తనది అన్నిమతాలు సమానమనే సిద్ధాంతమంటూ ప్రవచించిన మోదీ ఒక్క ముస్లింకైనా క్యాబినెట్‌లో చోటు కల్పించకపోవటాన్ని బట్టి తన నిజ స్వరూపం అర్థమవుతున్నది. అందువల్ల, పైన పేర్కొన్న రెండు ప్రసంగాలలో మోదీ ప్రస్తావించిన వివిధ అంశాలు, రాజ్యాంగ పరిరక్షణ సహా, అన్నింటిలోనూ విశ్వసించదగ్గది ఒక్కటైనా కన్పించటం లేదు.

బీజేపీ ఎదుగుదలకు కాంగ్రెస్ సహకారం



పి.సంతోష్

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే తమ అగ్ర నాయకుడు రాహుల్ గాంధీ నిర్దేశానుసారం ఆ పార్టీ పని చేసిందా? అనే విషయాన్ని లోతుగా విశ్లేషిస్తే.. మెజారిటీ తెలంగాణవాదులు చేయలేదనే అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ దేశంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తే.. తెలంగాణ కాంగ్రెస్ మాత్రం బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పావులు కదిపింది. అధికారంలోకి వచ్చిన దగ్గర్నుంచి కాంగ్రెస్ నాయకులు రోజుకొక కట్టు కథనం లేదా లీకుల పేరిట పదేండ్ల బీఆర్ఎస్ పాలనపై విషం చిమ్మారు. రాష్ట్రం దివాలా తీసిందని, కాళేశ్వరం నిరర్థకమని, రూ.లక్షల కోట్ల అవినీతి జరిగిందని, ఈవీ రేస్, పబ్లిక్ సర్వీస్ కమిషన్, ఫోన్ ట్యాపింగ్ పేరిట వివిధ మాధ్యమాలలో కట్టు కథలు అల్లి నిరంతరం ప్రసారం చేశారు.

పచ్చ మీడియా కూడా ఇదే అదనుగా భావించి తెలంగాణపై, కేసీఆర్‌పై ఉన్న కక్షతో కట్టు కథలను వండి వార్చింది. ఆంధ్రకు చెందిన చంద్రబాబు కూటమిలో భాగస్వామిగా ఉన్న బీజేపీ లేదా బాబు శిష్యుడి పార్టీ కాంగ్రెస్ గెలవాలన్నదే పచ్చ మీడియా లక్ష్యం. ఎట్టి పరిస్థితుల్లోనూ లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవకూడదనే ఏకైక ఉద్దేశంతోనే పచ్చమీడియా పని చేసిందని ఫలితాలను చూస్తేనే స్పష్టమవుతున్నది. సికింద్రాబాద్, చేవెళ్ల, మల్కాజిగిరి, కరీంనగర్, మహబూబ్‌నగర్ మొదలగు నియోజకవర్గాలలో కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక, ప్రకటనలో జాప్యం, ప్రచారంలో అలసత్వం వంటి అంశాలను పరిశీలిస్తే తెలంగాణ కాంగ్రెస్ నాయకత్వం బీజేపీ విజయానికి పరోక్షంగా సహకరించినట్టు తేటతెల్లమవుతున్నది.

2019 సార్వత్రిక ఎన్నికల్లో కాంగ్రెస్-బీజేపీల పరోక్ష సహకారం గురించి ఈ సందర్భంగా చర్చించుకోవాలి. కరీంనగర్, నిజామాబాద్‌లో బీజేపీకి కాంగ్రెస్ పరోక్షంగా మద్దతు ఇచ్చిందనేది అందరికీ తెలిసిందే. అదే విధంగా మల్కాజిగిరిలో బీజేపీ సహకరించడం వల్లనే కాంగ్రెస్ గెలిచిందని అప్పట్లో విశ్లేషకులు అభిప్రాయపడ్డారు. అటు బీజేపీ కూటమిలో, ఇటు కాంగ్రెస్ కూటమిలోనూ లేని ప్రాంతీయ పార్టీలను ఆ రెండు జాతీయ పార్టీలు కుమ్మక్కై దెబ్బకొట్టాయని 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. ఒడిశాలో నవీన్ పట్నాయక్‌ను బీజేపీ-కాంగ్రెస్ కలిసి దెబ్బకొట్టగా, ఆంధ్రాలో షర్మిల ద్వారా బీజేపీ కూటమితో అంటకాగిన కాంగ్రెస్.. జగన్ నాయకత్వంలోని వైఎస్ఆర్‌సీపీని కోలుకోలేని విధంగా దెబ్బతీసింది. అదేవిధంగా తెలంగాణలో కేసీఆర్ పుంజుకుంటే తమకు పుట్టగతులు ఉండవనే భయంతోనే రెండు

ఢిల్లీ పార్టీలు తెలంగాణ ఇంటి పార్టీని దెబ్బకొట్టాయి. తెలంగాణ వ్యాప్తంగా హిందూ ఓటర్లను పోలరైజ్ చేయటానికి మాధవీలతను బీజేపీ వాడుకోగా.. మైనారిటీ, దళిత ఓటర్లను కాంగ్రెస్ వైపు పోలరైజ్ చేయటానికి ఒవైసీతో పాటు రాజ్యాంగంలో మార్పు, రిజర్వేషన్ల రద్దు లాంటి అంశాలను కాంగ్రెస్ వాడుకున్నది. ఈ విధంగా బీజేపీ-కాంగ్రెస్ పార్టీలు పరోక్షంగా ఒకరికొకరు సహకరించుకుంటూ కేసీఆర్, బీఆర్ఎస్‌ను దెబ్బకొట్టడంలో ఈసారి సఫలమయ్యాయి. ఈ సందర్భంగా

‘You can fool All the people some time
Some people all the time
But not all the people all the time’.. అనే అమెరికా మాజీ అధ్యక్షుడు అబ్రహాం లింకన్ సూక్తిని గుర్తుచేసుకోవాల్సిన అవసరం ఉన్నది.

బీజేపీ-కాంగ్రెస్ పార్టీల కుట్రను ఇప్పుడిప్పుడే తెలంగాణ ప్రజలు అర్థం చేసుకుంటున్నారు. ఆ పార్టీల పన్నాగం పూర్తిగా అర్థమైన రోజు రెండు ఢిల్లీ పార్టీలను ప్రజలు తెలంగాణ నుంచి తరిమికొడతారు.

జై తెలంగాణ! జైజై తెలంగాణ!!

అంగట్లో వైద్య విద్య!

బి.వీరభద్రం
94929 30835

నాడు సేవగా భావించిన వైద్యం నేడు వ్యాపారంగా మారింది. ఫలితంగా వైద్య విద్యలో నాణ్యత కొరవడింది. వ్యాపారమే పరమావధిగా భావించే ప్రైవేటు కళాశాలలు, యూనివర్సిటీలు పుట్టగొడుగుల్లా పుట్టుకురావడంతో వైద్య విద్య పెద్దల విద్యగా మారిపోయింది. దీనికి తోడు జాతీయ స్థాయిలో ఎన్టీఏ నిర్వహించే ప్రవేశ పరీక్ష నీట్ కారణంగా వైద్య విద్య పేదలకు అందని ద్రాక్షే అయింది.

ఎంబీబీఎస్, బీడీఎస్‌తో పాటు ఇతర వైద్య విద్య కోర్సుల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే నీట్ పరీక్ష నిర్వహణపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో రోజురోజుకు నమ్మకం సన్నగిల్లుతున్నది. ఎన్టీఏ తీరుపై, విశ్వసనీయతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. నీట్‌లో ఏటా ఇద్దరు లేదా ముగ్గురు ఆలిండియా ఫస్ట్ ర్యాంక్ సాధిస్తుండగా.. ఈ సారి ఏకంగా 67 మంది టాపర్లుగా నిలవడం పలు అనుమానాలకు తావిస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో పేలవ నిర్వహణ, ప్రభుత్వాల నిర్లక్ష్యం, పేపర్ లీకేజీలు ఈ అనుమానాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి.

మే 5న జరిగిన నీట్ పెద్ద స్కాం అంటూ ఆరోపణలూ వెల్లువెత్తుతున్నాయి. దేశవ్యాప్తంగా సుమారు 23 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ పరీక్షను రాశారు. అయితే సరిగ్గా పరీక్షకు రెండు రోజుల ముందు ‘నీట్ చీటింగ్ స్కాం’ బయటకు వచ్చింది. గుజరాత్‌కు చెందిన కొంతమంది విద్యార్థులకు ఉత్తీర్ణత సాధించేలా చేస్తామని హామీ ఇచ్చిన ఓ విదేశీ ఎడ్యుకేషన్ కన్సల్టెన్సీ సంస్థ ఒక్కొక్కరి నుంచి రూ.10 లక్షల చొప్పున వసూలు చేసినట్టు ఆరోపణలు వచ్చాయి. బీహార్‌లో ఒక్కొక్కరి నుంచి రూ.20-30 లక్షల చొప్పున వసూలు చేశారనే ఆరోపణలపై పరీక్షకు ముందు రోజు కొందరిని అరెస్టు చేయడం కలకలం రేపింది. మరోవైపు పరీక్ష రోజు ప్రశ్నాపత్రం లీక్ అయినట్టు సోషల్ మీడియాలో ప్రచారం జరిగింది. రాజస్థాన్‌లోని ఓ పరీక్షా కేంద్రంలో హిందీ మీడియం విద్యార్థులకు పొరపాటున ఆంగ్ల మీడియం ప్రశ్నాపత్రం ఇచ్చారని, పొరపాటును గుర్తించేలోపే 100 మందికి పైగా ప్రశ్నాపత్రాలతో సహా బయటకు వెళ్లిపోయారని, సాయంత్రం 4 గంటల తర్వాతే సోషల్ మీడియాలో ప్రశ్నాపత్రం షేర్ అయిందని ఎన్టీఏ అధికారులు దీనిపై వివరణ ఇచ్చారు. అప్పటికే దేశంలోని అన్ని కేంద్రాల్లో పరీక్ష ప్రారంభమైందని, అందువల్ల పేపర్ లీక్ కాలేదని వారు స్పష్టత ఇచ్చారు. కాగా, తెలంగాణలోని కుమ్రం భీం జిల్లాలోనూ ప్రశ్నాపత్రం తారుమారైంది. దేశవ్యాప్తంగా విద్యార్థులకు ఇచ్చిన ప్రశ్నాపత్రం కాకుండా ఇక్కడ వేరే పేపర్ ఇచ్చారు. ఎన్నో అవకతవకలు జరిగాయి కాబట్టి ఫలితాలను వాయిదా వేయాలి.



నీట్‌పై ఆరోపణలు రావడం ఇదేమీ తొలిసారి కాదు. 2021లో పేపర్ లీక్ ఆరోపణలపై రాజస్థాన్‌లో 16 మంది అరెస్ట్ అయ్యారు. మహారాష్ట్రలో ఓ కేంద్రంలో ఒకరికి బదులు మరొకరు పరీక్ష రాసినట్టు సీబీఐ తేల్చింది. ఇలా అక్రమాలకు పాల్పడి సీట్లు పొందుతున్నవారంతా ధనవంతుల పిల్లలే. వారంతా అడ్డదారుల్లో ర్యాంకులు తెచ్చుకొని ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పొందుతున్నారు. దీంతో పేద విద్యార్థులు అప్పోసప్పో చేసి లక్షల రూపాయలు కుమ్మరించి ప్రైవేట్ కళాశాలల్లో చదవాల్సిన దుస్థితి దాపురించింది. నీట్ నిర్వహణలో మంత్రుల జోక్యం కారణంగా ఎన్టీఏ స్వయం ప్రతిపత్తి ప్రశ్నార్థకంగా మారుతున్నది. అక్రమాలకు అడ్డాగా మారిన ఎన్టీఏను రద్దు చేయాల్సిన అవసరం ఉన్నది. సమానత్వం, సామాజిక న్యాయానికి తూట్లు పొడుస్తూ ఎంతో మంది విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న ఈ పరీక్షను నిలిపివేయడమే శ్రేయస్కరం.

పింఛన్ బకాయిలను చెల్లించాలి!

ఆళవందార్ వేణు మాధవ్
86860 51752

కార్మికుడు తన వృద్ధాప్యంలో ఆరోగ్యకరమైన జీవితాన్ని గడపడానికి పింఛన్ కీలకపాత్ర పోషిస్తుంది. దశాబ్దాల తరబడి పనిచేసి, పని చేయలేని స్థితిలో పదవీ విరమణ చేసిన వారికి నిర్దిష్ట మొత్తంలో పింఛన్ చెల్లించడం ప్రభుత్వ విధి. అది కార్మికుడి హక్కు కూడా. కొత్త పింఛన్ స్కీం (ఎన్‌పీఎస్)ను రద్దుచేసి పాత పింఛన్ స్కీం (ఓపీఎస్)ను మళ్లీ తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు డిమాండ్ చేస్తున్న విషయం తెలిసిందే.

ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ పింఛన్ స్కీం 1995 (ఈపీఎస్-95) పరిధిలోకి వచ్చే పింఛనర్లు తమ కనీస నెలవారీ పింఛన్‌ను 2014, సెప్టెంబర్‌లో నిర్ణయించిన ప్రస్తుత రూ.1,000 నుంచి రూ.7,500కి పెంచాలని డిమాండ్ చేస్తున్నారు. రిటైర్డ్ సాయుధ దళాల సిబ్బంది ఒకే ర్యాంక్, ఒకే పింఛన్ డిమాండ్‌తో సుదీర్ఘకాలంగా పోరాటం చేస్తున్నారు. 2004 తర్వాత ఉద్యోగం చేరిన ప్రభుత్వ ఉద్యోగులందరికీ తప్పనిసరి అయిన కొత్త పింఛన్ స్కీమ్ ఎన్‌పీఎస్. ఇది కార్మికుడి పదవీ విరమణ తర్వాత కనీస నెలవారీ ఆదాయానికి హామీ ఉండదు. అందుకే పాత పింఛన్ స్కీమ్ (ఓపీఎస్) కోసం కార్మికులు పోరాటం చేస్తున్నారు. కార్మికుడికి అతని చివరి జీతం, డియర్‌నెస్ అలవెన్స్‌లో 50 శాతం స్థిర పింఛన్ ఆదాయానికి ఓపీఎస్ హామీ ఇస్తుంది. ప్రస్తుతం ఎన్‌పీఎస్ కింద పదవీ విరమణ చేస్తున్న ఉద్యోగులు పొందుతున్న పింఛన్ చాలా తక్కువ మొత్తంగా ఉన్నది. రూ.2000-5000 రూపాయల లోపు మాత్రమే వస్తుంది. ఇది వృద్ధాప్యంలో సరిపోవడం లేదు. అందుకే దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగులు ఎన్‌పీఎస్‌ను వ్యతిరేకిస్తున్నారు.

బొగ్గు విశ్రాంత కార్మికులకు కూడా కోల్‌మైన్స్ పింఛన్ స్కీం-1998 పొందుపరిచిన నిబంధనల ప్రకారం 26 ఏండ్ల కిందట కనీస పింఛన్ రూ.350గా నిర్ణయించారు. కార్మిక సంఘాలు, విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘాల పోరాటాల ఫలితంగా కేంద్రప్రభుత్వం కోల్‌మైన్స్ పింఛన్ స్కీం సవరణ చేసి గెజిట్‌లో బొగ్గు విశ్రాంత కార్మికుల కనీస పింఛన్ రూ.1000 చేసింది. ఈ పింఛన్ పొందేవారు దాదాపు 19,000 ఉండవచ్చు నేమో! ఇది రాష్ట్ర ప్రభుత్వం చెల్లించే వృద్ధాప్య పింఛన్ 2,016 రూపాయల కన్నా తక్కువ. అవి కూడా సరైన సమయంలో రావడం లేదు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే నిరక్షరాస్యత గల విశ్రాంత బొగ్గు కార్మికులు, వితంతువులు పెరిగిన వెయ్యి రూపాయల కనీస పింఛన్ కోసం గత కొంతకాలంగా ఎదురు చూస్తున్నారు. కాబట్టి ప్రభుత్వ ఉత్తర్వులను అనుసరించి వెంటనే కనీస పిం ఛన్ వెయ్యి రూపాయలను అమలుచేస్తూ బకాయిలను వెంటనే చెల్లించాలి.